


అది ముసురు పట్టిన రాత్రి.

ప్రకృతి భీకరంగా గర్జిస్తోంది. చిక్కటి చీకట్లో చెట్లు దయ్యాల్లాగా తలలాడిస్తున్నాయి. చల్లగా శరీరాన్ని కొరికి వేసే చలి గాలి రివ్వుమని వీస్తోంది. మెరుపులు కళ్ళను మిరుమిట్లు గొలుపుతున్నాయి.

ఎక్కడో పిడుగు పడింది. ఒక్క సారిగా ఉలికిపడి లేచాడు మూర్తి.

నిద్రమత్తులో అసలు జరిగింది ఏమిటో తెలియక ఒక్క క్షణం అంతా అగమ్య గోచరంగా అనిపించింది. అటూ ఇటూ చూశాడు.

నెమ్మదిగా లేచి కిటికీ తలుపులు మూసేశాడు. చలికి గడ్డ కట్టుకున్న శరీరానికి తిరిగి జీవం పొయ్యాలంటే సిగరెట్ వెలిగించాలి. సిగరెట్ పెట్టె వెతకడానికి స్విచ్ వేశాడు. లైటు వెలగలేదు.

'వెధవ కరెంటు. ఇది కూడా


ముసురు పట్టిన రాత్రి
వి.ఆర్.కౌండిన్య

## ముసురు పట్టిన రాత్రి



యిప్పుడే పోవాలా' అనుకుంటూ చీకట్లోనే సిగరెట్ పెట్టెకోసం తడిమాడు. దొరికింది. 'అమ్మయ్య' అనుకుంటూ సిగరెట్ ముట్టించాడు. కొద్ది సేపటికి శరీరానికి కాస్త వెచ్చదనం వచ్చింది.

ఇంతలోనే తలుపు తట్టిన చప్పుడు అయింది. 'ఈ అర్ధరాత్రి వేళ నాకోసం ఎవరొస్తారబ్బా! పక్కింటి వాళ్ళ తలుపు కొడుతున్నారేమో' అనుకున్నాడు.

ఇంతలోనే కరెంటు వచ్చింది. తలుపు మళ్ళీ తట్టిన చప్పుడయింది. ఈ సారి జాగ్రత్తగా విన్నాడు. తన యింటి తలుపే ఎవరో కంగారుగా కొడుతున్నారు. చెంగున లేచి వెళ్ళి తలుపుతీశాడు.

'కాసేపు లోపల ఉండనిస్తారా? వర్షంతగ్గగానే వెళ్ళిపోతాను.'— ఆమెను చూస్తూ అలాగే నిలబడిపోయాడు. మళ్ళీ వెంటనే తెలివి తెచ్చుకొని 'ముందు, లోపలికి రండి. బయట వర్షంలో తడుస్తున్నారు' అన్నాడు. ఆమె ముందుకు రావటానికి తడబడుతోంది.

'ఓ! సారీ! నేను దారిలో అడ్డున్నాను కదూ!' అంటూ ప్రక్కకు తప్పుకున్నాడు.

ఆమె లోపలికి వచ్చింది. తలుపు మూసి వెనక్కి తిరిగాడు. అప్సరస ఎవరైనా దివినుంచి భువికి దారి తప్పి వచ్చిందా అన్నంత అందంగా ఉంది ఆమె. చాలా సింపుల్‌గా అలంకరించుకుంది. బిస్కెట్ రంగు వాయిల్ చీర కట్టుకొని అదే రంగు జాకెట్ వేసుకొంది. మెడలో....అదేమిటి....మంగళసూత్రం!

టవల్ ఇచ్చాడు. 'తల తుడుచుకోండి. లేకపోతే జలుబుచేస్తుంది'

'థాంక్స్.' అంటూ టవల్ తీసుకొని ఒళ్ళు పైపైన తుడుచుకొని, జుట్టు తుడుచుకొంటోంది.

'కూర్చోండి' అంటూ, ఫ్లాస్కులో ఉన్న వేడికాఫీ గ్లాసులో పోసి యిచ్చాడు.

'థాంక్స్.' కాఫీ తాగాక కాస్త స్థిమితపడింది ఆమె.

"మీ పేరు?"

"వసుంధర"

"ఐసీ! నాపేరు మూర్తి."

మళ్ళీ తనే అడిగాడు. "ఇంత రాత్రివేళ ఈ వర్షంలో ఎక్కడికి

బయలుదేరారు? అందులోనూ.... ఒంటరిగా" అన్నాడు. ఆమె మెడలోని మంగళసూత్రాల వంక చూస్తూ.

"నాకు వివాహం అయింది." అంది ఆమె.

"గమనించాను. మీ వారికి ఏమిటి పని?"

ఆమె పైట సర్దుకుంటూ అంది: "మావారు ఇక్కడే షుగర్ ఫ్యాక్టరీలో స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. ఇవ్వాళ నేను సినిమాకి వెళ్ళేటప్పుడు ఇంత పెద్ద వర్షం పడుతుందని అనుకోలేదండీ. నిలిచిపోతుందనుకున్నాను."

"ఎక్కడన్నా కాసేపు ఆగక పోయారా?"

"సినిమాహాలు దగ్గరే కాసేపు ఆగాను. కాని, పదకొండుగంటలై పోయిందని బయల్దేరాను. కాని, ఇక్కడికొచ్చిం తర్వాత అడుగు

## ముసురు పట్టిన రాత్రి



ముందుకు వెయ్యలేక పోయాను."

"ఇంతకీ నా ప్రశ్నకి జవాబు చెప్పలేదు" అన్నాడు మూర్తి ఇంకో సిగరెట్ వెలిగిస్తూ.

"నేను ఒంటరిగా రావటానికి కారణం చెప్పాలంటే, నా కథ పూర్తిగా మీకు చెప్పాలి. వర్షం వస్తోందని కాసేపు ఉండడానికి ఆశ్రయం యిచ్చినందుకే మీకు చాలా శ్రమకలిగించాను. నాకథ కూడా చెప్పి...."

ఆమె తన మాట పూర్తిచేయకుండానే "నో....నో....అలాంటి మాటలేమీ అనకండి. మీ కథ

## అజాగ్రత్త

"రామూ, ఏమిటిరా నీ చేతులు ఎర్రగావున్నాయి. మాష్టారు కొట్టారా?"

"అవునమ్మా, తాజ్‌మహల్ ఎక్కడుంది అని అడిగారు. తెలీదన్నాను. అంతే - గొడ్డుని బాదినట్లు బాదారు."

"తెలీదన్నావా? అయితే కొట్టవలసిందే. ఇకనుంచయినా నీ వస్తువులు నీవు జాగ్రత్తగా వుంచుకోవటం నేర్చుకో."

# ముసురు పట్టిన రాత్రి



చెప్పండి. ఫరవాలేదు. వర్షం కూడా తగ్గేట్లు లేదు" అన్నాడు మూర్తి కిటికీ తలుపులు తీస్తూ.

'మావారు షుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారని చెప్పాను కదా! ఆయన పేరు భుజంగం. ఆయన ఈ వేళ మా అత్తగార్ని చూసిరావాలని విజయవాడ వెళ్లారు. రేపు సాయంత్రం గాని తిరిగిరారు.'

ఆమె సర్దుకొని కూర్చొని చెప్పటం మొదలు పెట్టింది.

'ఆగండి'అంటూ మూర్తి రెండు గ్లాసుల్లో కాఫీపోసి ఒకటి ఆమెకిచ్చి మరొక గ్లాసు తను తీసుకున్నాడు.

'ఇప్పుడు చెప్పండి' అన్నాడు మంచంమీద కూర్చుంటూ.

ఆమె చెప్పటం మొదలు పెట్టింది....

"సాధారణంగా ప్రపంచంలో ప్రతి స్త్రీ కన్నెవయసులో తనకు కాబోయేభర్తను గురించి బంగారు కలలు గంటుంది. ఎన్నో ఆశలు పెంచుకొంటుంది. తమ దాంపత్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలని, తన భర్తకూ తనకూ మధ్య ఆప్యాయత, అనురాగాలకి లోటు ఉండకూడదని....ఇలాగే చాలా ఊహించుకుంటుంది. ఇది సహజం. వివాహం జరిగిన తర్వాత తన కలలకు అనుగుణంగా ఉన్న భర్త లభిస్తే ఆమెకు జీవితంలో ఇంక కావలసింది ఏముంటుంది? కాని, తన కలల్లో ఊహించుకున్న తన ప్రియుడికి, తను కట్టుకున్న భర్తకి చాలా తేడా ఉందని, అసలు పోలికే లేదని, తను కట్టుకొన్న గాలి మేడలన్నీ కూలిపోయాయని జీవితంలో తనకు యింక మిగిలింది చీకటేనని ఆమె తెలుసుకున్నప్పుడు ఏమి చెయ్యగల్గుతుంది? ఏమీ చెయ్యలేదు. అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది.

నా జీవితం కూడా ఆ రెండో కోవకు చెందినదే. మా వారికి లేని వ్యసనం అంటూ లేదు. త్రాగుడు, పేకాట దగ్గర్నుంచి అన్నీ ఉన్నాయి. ఎన్ని ఉన్నా భరించవచ్చు. కాని, అన్నిటికన్నా ఘోరమైనది, దాంపత్య జీవితాన్ని సర్వనాశనం చేసేది....అనుమానం. నా యొక్క ప్రతి కదలికనూ ఆయన అనుమానంతో చూస్తారు.

నేను సినిమా చూసి రెండేళ్ళ యింది. మీరు ఆశ్చర్యపోవచ్చు. కాని, నేనేమి చేయగలను. మా వివాహం జరిగి కూడా రెండేళ్ళే అయింది. ఇప్పుడు మీకు అర్థం అయి ఉంటుంది. పెళ్ళి అయిన వారం రోజులకి మేం ఇద్దరంకలిసి మొదటిసారిగా సినిమాకి వెళ్లాం.

ఆరోజు..........

"వసూ....వసూ...." ఆయన ఆఫీసునుంచి వస్తూనే హడావిడిగా బూట్లు తీసేస్తున్నారు. "తొందరగా తెమలాలి. మారుతీలో మంచి పిక్చరొచ్చింది. టిక్కెట్లు కూడా తెచ్చాను."

"ఇదిగో, ఇప్పుడే వస్తున్నా. మీరు ఈ కాఫీ టిఫిన్ తీసుకొనే లోగా నేను స్నానంచేసి వస్తాను" అంటూ ఆయనకు కాఫీ, టిఫిన్ ఇచ్చి నేను స్నానానికి వెళ్ళాను.

నేను స్నానం పూర్తిచేసి, తల దువ్వుకొని, నాకు యిష్టమయిన బిస్కెట్ రంగు చీర తీసుకొని రెడీ అవుతున్నాను. ఇంతలోనే ఆయన తయారయిపోయారు.

"వసూ...టైం అయిపోతోంది, త్వరగా తెములు. అబ్బబ్బ....మీ ఆడవాళ్ళతో ఎప్పుడూ ఇంతే." ఆయన కంగారు పెడుతున్నారు.

"ఇదిగో వస్తున్నా. పౌడరు

## ముసురు పట్టిన రాత్రి



రాసుకుని...."

"నువ్వు యిప్పుడు వస్తోంది సినిమా చూడటానికా లేక నీ అందం చూపించటానికా? అక్కడ నిన్ను చూడటానికి ఎవరూ రావటం లేదు, త్వరగా తెములు" కర్కశంగా వినపడ్డాయి ఆయన మాటలు.

నా మనస్సు చివుక్కుమంది. "ఏమిటి ఈ మనిషి ఉద్దేశ్యం? పోనీ, సరసంగా అన్నారను కొంటే, ఏ భర్తా తన భార్యతో అలాంటి పరిహాసం ఆడడు. ఆయన ఆంతర్యం అప్పుడే అర్థం కావటం మొదలు పెట్టింది.

ఆయనతోపాటు హాల్లోకి వెళ్ళి కూర్చున్నాను. హాలంతా కిట కిట లాడుతోంది. ఎటుచూసినా జంటలే. కులాసాగా కబుర్లు చెప్పుకుంటు న్నారు. వాళ్ళనందర్నీ చూస్తూ అటూ ఇటూ చూస్తున్నాను.

"ఎందుకలా అందరివంకా చూస్తావు? నీ అందంచూసి వాళ్లంతా మూర్ఛ పోవాలనుకుంటున్నావా?"

## ముసురు పట్టిన రాత్రి



కోపంగా, నెమ్మదిగా ఆయన అన్న ఆ మాటలు నా మనసులో శూలాలై గుచ్చుకొన్నాయి. నా కనుకొలకుల్లో నీళ్ల నిలిచాయి. ఆయనతోపాటు సినిమాకి వచ్చినందుకు నన్ను నేనే నిందించుకున్నాను.

ఇంతలో ఎవరో ఒక యువకుడు హాల్లోకి ప్రవేశించాడు. హాలులో ఎక్కడా ఖాళీ లేదు. నా ప్రక్క సీటు ఒక్కటి ఖాళీగా ఉంది. మా వారికి అవతలివైపు సీట్లో ఎవరో ఆడవాళ్లు ఉన్నారు. దీన్నిబట్టి మీకు ఆయన తత్త్వం అర్థం అయ్యే ఉంటుంది. అవతల కుర్చీల్లో ఉన్న ఆడవాళ్లు పాపం ఏమీ మాట్లాడలేక ఇబ్బంది పడటం నేను గమనించాను. కాని, ఏం చేయగలను. అవకాశం వచ్చినపుడు ఈయనికి బుద్ధి చెప్పాలనుకున్నాను.

అందుకే ఆ యువకుడు నా దగ్గరికి వచ్చి “ఈ సీట్లో కూర్చోవచ్చునాండీ?” అని అడిగినప్పుడు, ఆయన ఏమంటారో చూద్దామని కూర్చోమన్నాను.

ఆయన వెంటనే కోపంగా లేచి నుంచున్నారు. నన్ను తన సీట్లోకి వెళ్ళమని, నా సీట్లోకి తను మారాడు. మిగతా జనం అంతా మమ్మల్ని వింతగా చూశారు. ఇంతలో లైట్లు ఆర్పేసి, సినిమా మొదలు పెట్టారు. ఆ రోజు నేను సినిమా ఎలా చూశానో నాకే తెలియదు.

ఇంటికి వస్తూనే:

“ఎవడు వాడు?” అన్నారు ఆయన కోపంగా.

“వాడంటే?”

“వాడే. ఇందాక నీతో హాల్లో మాట్లాడి, నీ ప్రక్క సీటును సింగారించినవాడు!” ఆయన కంఠం అసహ్యంగా వినిపించింది.

“నాకు తెలియదు” అప్రయత్నంగా నా నోటినుండి పెంకి సమాధానం వచ్చింది.

“నీకు తెలియకుండానే నీతో ఎలా మాట్లాడాడు? వాడెవడో చెప్పు” అన్నారు, ఆయన కఠినంగా.

నాలో కూడా పట్టుదల పెరిగింది. “ఎప్పుడూ ఆయనదే పైచెయ్యి ఎందుకు అవాలి?” అనుకున్నాను.

"నాకు తెలియదని చెప్పాగా" అన్నాను దురుసుగా.

చెంప ఛెళ్ళుమంది. నా కళ్ళు బైర్లు కమ్మాయి. నాలో ఏదో నీరసం ఆవహించింది. స్పృహ తప్పి పడిపోయాను.

అర్ధరాత్రివేళ తెలివి వచ్చింది. చుట్టూ అంతా చీకటి. ఆయన యింట్లోలేరు. అలా బైటకి వెళ్ళిపోయిన ఆయన రెండు రోజుల దాకా తిరిగి రాలేదు.

ఈ విధంగా నన్ను కొట్టటం, రెండు మూడు రోజులు కనపడకుండా తిరిగి రావటం ఆయనకి మామూలు అయిపోయింది.

అప్పటినుంచి, ఇవ్వాళ్టివరకూ ఆ నాలుగు గోడలమధ్య జీవచ్ఛవంలా బ్రతికాను. ఇవ్వాళ ఎన్నడూ లేనిది ఆయన మా అత్తగార్ని చూసి వస్తానని బయల్దేరారు. రేపు సాయంత్రం వరకు మళ్ళీ రారు.

**ముసురు పట్టిన రాత్రి**



సాయంత్రం అయ్యేసరికి, నాలో ఇన్నాళ్ళూ నిద్రించిన కోరికలు మేల్కొన్నాయి. సినిమాకి వెళ్ళాలనిపించింది. అందుకే కొద్దిగా వర్షం పడుతున్నా సినిమాకి

## రచయిత్రి వంటకం

ఒక రచయిత్రి ఓ ప్రసిద్ధ పత్రికకి 'పకోడీలు చెయ్యటం ఎలా?' అనే విషయం మీద ఒక వ్యాసం రాసి తెచ్చింది. సంపాదకుడు పూర్తిగా చదివాక, "మీకు నచ్చిందా" అని అడిగింది.

"బాగుంది. కాని దీనికి చివర్లో ఒక లైను కలపవలసి వుంటుంది." అన్నాడు సంపాదకుడు.

"ఒకటి కాదు పదిలైన్లు అయినాసరే కలుపుకోండి. మీకు నచ్చితే చాలు" అంది రచయిత్రి.

"నేనుకాదు. మీరే కలపాలి. ఈ పకోడీలు తిన్న తరువాత వెంటనే ఏ మందు వేసుకుంటే బాగుంటుందో డాక్టర్ గారినిఅడిగి ఆపేరు కూడా వ్యాసం చివరరాయండి." అన్నాడు సంపాదకుడు.

## ముసురు పట్టిన రాత్రి



బయల్దేరాను.''

ఆమె చెప్పటం ఆపింది. మూర్తి త్రాగుతున్న సిగరెట్ పూర్తి అయి వేలు చురుక్కుమంది.

"మీలో యింతటి విషాదం దాగుందని నాకు తెలియదు. ఇదంతా మళ్ళీ జ్ఞాపకం చేసినందుకు ఏమీ అనుకోకండి" అన్నాడు.

"ఫరవాలేదు. నేను రోజూ చేసేపని, ఇదంతా గుర్తు చేసుకుంటూ ఉండటమే.'' అంది ఆమె కళ్ళనీళ్ల తుడుచుకుంటూ.

వాళ్ళిద్దరి మధ్య వాతావరణం బరువుగా ఉంది.

"సరే, ఇప్పుడు మీరు యింటికి వెళ్లేసరికి, మీ వారు అక్కడ ఉన్నారనుకోండి. మీరేంచేస్తారు' అన్నాడు మూర్తి చిన్నగా నవ్వుతూ.

కాని, అతను ఆశించినట్లు వాళ్లిద్దరి మధ్యా వాతావరణం తేలిక అవలేదు. దానికి బదులుగా, ఆమె ఒక్కసారిగా లేచినుంచుంది. ఆమె శరీరం పైనుంచి క్రిందివరకూ వణికిపోతోంది. మొహంలోనూ, కళ్లలోనూ భయం విలయ తాండవం చేస్తోంది. ఆమె ఏమి మాట్లాడుతోందో ఆమెకే తెలిసినట్లు లేదు.

"లేదు.... వీల్లేదు .... అట్లా జరగటానికి వీల్లేదు. ఆయన నన్ను చంపేస్తారు. నా మీద కిరసనాయిలు పోసి అంటించేస్తారు.... అయ్యబాబోయ్.... అదిగో నన్ను అంటించేస్తున్నారు.... నేను కాలిపోతున్నాను....మంటలు.... మంటలు....నన్ను రక్షించండి.... రక్షించండి" అంటూ ఆమె బయటికి పరిగెత్తింది.

మూర్తి ఒక్కక్షణం అగమ్యగోచరమైన స్థితిలో ఉన్నాడు.కాని, వెంటనే తేరుకొని వెంట పరుగెత్తాడు.

"ఏమండీ.... వసుంధరా .... మీతో.... నేను ఊరికే అన్నాను ఆగండి....అరే....చీకట్లో పరిగెడుతున్నారు.... వర్షం తగ్గలేదు.... ఆగండి...." అంటూ అరుస్తూ పరిగెత్తాడు. కొంత దూరంవరకూ ఆమె కనబడింది. తర్వాత చీకట్లో కలిసిపోయింది.

* * *

"ఇదంతా రాత్రి జరిగింది" అన్నాడు మూర్తి కాఫీ కప్పు టేబుల్ మీద పెడుతూ! హోటల్లో కూర్చొని తన స్నేహితులతో రాత్రి జరిగిన సంగతి చెబుతూ.

"అరే.... ఈ కథ మంచి సస్పెన్స్‌లో ఆగిందే! ఆమె అసలు ఎవరో? ఆమె భర్త ఆమెని ఏం చేశాడో? మీరు ఆ మాట అనగానే ఆమె ఎందుకు అంతగా భయ పడిందో? ఆమె చివరి మాటల అర్థం ఏమిటో? ఇదంతా భయంక రమైన సస్పెన్స్ సినిమాలాగా ఉంది. ఇదంతా మరి మనకి ఎవరు చెప్తారు?" అన్నాడు మూర్తి కొలీగ్ రాజు, మిగతావాళ్ళు తల ఊపారు.

"నేను చెప్తాను."

అందరూ ఉలిక్కి పడ్డారు.

ప్రక్క టేబుల్ దగ్గర కూర్చొని అప్పటి వరకూ వాళ్ళ మాటలన్నీ విన్న ఒక మనిషి, వీళ్ళు కూర్చొన్న టేబుల్ దగ్గరకి వచ్చాడు.

బాగా పెరిగిన గడ్డం, మాసిపో

## ముసురు పట్టిన రాత్రి



యినబట్టలు, చూడటానికి వికారిగా అనిపించే ఆ మనిషి కళ్ళల్లో జీవం కనిపించటంలేదు. దేనికో పశ్చా త్తాప పడుతున్న వాడిలాగా. ఏదో మంట అతని గుండెని బడబానలమై కాలుస్తున్నట్లుగా బాధ పడుతున్న వాడిలా ఉన్నాడు.

"నిన్న మీ యింటికి వచ్చింది వసుంధర అని మీరు అనుకుంటు న్నారా?" అని అడిగాడు అతను, మూర్తిని.

మూర్తి తికమక పడ్డాడు. "అవును. ఆమె అలాగే చెప్పింది" అన్నాడు.

"కాదు. వసుంధర చనిపోయి రెండు సంవత్సరాలైంది"

అందరూ నిశ్చేష్టులయ్యారు.

"అయితే....నిన్న మాయింటికి

---

## వివాహం

"ఇరవై సంవత్సరాల వరకు నేనూ నా భార్య హాయిగా గడపేం"

"మరి యిప్పుడే మయింది?"

"వివాహ మయింది!"

# ముసురు పట్టిన రాత్రి



వచ్చింది....”

“ఆమె ఆత్మ.” అన్నాడు శూన్యంలోకి చూస్తూ. మూర్తి వెంటనే అక్కడ ఉన్న గ్లాసుడు మంచి నీళ్ళు గడగడా త్రాగేశాడు.

“వివరంగా చెప్పండి. ఆమె దయ్యం అంటే నేను నమ్మలేకుండా ఉన్నాను.” అన్నాడు మూర్తి కంగారుగా. అతని చేతులు మాటలు వణుకుతూ ఉండటం అందరూ గమనించారు.

“చెప్తాను. వినండి....వసుంధర తన భర్తని గురించి చెప్పింది అంతా నిజమే. రెండు సంవత్సరాల క్రితం జరిగిన సంగతిది. ఆమె భర్తకి ఆమె శీలం ఎలాంటిదో తెలుసుకోవాలని అనిపించింది. దానికి కారణం ఉంది. అతను తన ఆఫీసులో పనిచేస్తున్న మరొక టైపిస్టుని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. అందుకు ఈమెకు విడాకులిచ్చి వదిలించుకోవాలని. అందుకోసం ఆమె శీలం మంచిది కాదని సాక్ష్యంతో సహా నిర్ధారణ చెయ్యాలని అనుకొన్నాడు. అందుకని చిన్న నాటకం ఆడాడు. తన తల్లిని చూసి వస్తానని బయల్దేరాడు. ఆమె నమ్మింది. మళ్లీ మర్నాడు సాయంత్రం వరకు రాడనుకొంది.

తన కోరికల్ని దాచుకోలేక పోయింది ఆమె. అందుకే కొద్దిగా వర్షం పడుతున్నా సినిమాకి బయల్దేరింది. ఆమె భర్త ఆమెను రహస్యంగా వెంబడిస్తూనే ఉన్నాడు. అతడు కూడా ఆమె వెనకే సినిమా హాల్లోకి వచ్చి కూర్చున్నాడు.

సినిమా పూర్తయింది. ఆ రోజు కూడా నిన్నటిలాగానే ముసురు పట్టింది. వర్షం బాగా ఎక్కువగా ఉంది. చాలాసేపు థియేటర్ దగ్గర ఆగి వర్షం తగ్గకపోవటం మూలాన బయల్దేరింది. అతను వెంబడించాడు. మధ్యలో ఆమె ఇక ముందుకు పోలేక ఒక యింటి తలుపుతట్టి, కాసేపు ఆగటానికి లోపలికి వెళ్ళింది. అది చూసిన అతను తన నమ్మకాన్ని నిర్ధారించుకున్నాడు.

రాత్రి పన్నెండుగంటలకి ఆమె ఇంటికి వచ్చేసరికి అతను ఇంట్లోనే ఉన్నాడు. ఆమె కొయ్యబారిపోయింది. పర్యవసానం ఆమె

**ముసురు పట్టిన రాత్రి**



ఊహకి అందనిదిగా ఉంటుందని అనుకుంది. ఆమెకు ఏం మాట్లాడాలో తెలియదు. అతనిలోని కసి, ద్వేషం తారస్థాయినందుకున్నాయి. ఆమెని గొడ్డును బాదినట్లు బాదాడు. ఆమె కన్నీళ్ళు రాతినైనా కరిగించగలవేమోగాని, అతని పాషాణ హృదయాన్ని మాత్రం కదిలించలేకపోయాయి. ఆమె అసలు విషయం చెప్పి క్షమాపణ వేడింది. అతనికి నమ్మకం కుదరలేదు. కాసేపట్లోనే ఆమె స్పృహతప్పి పడిపోయింది. అయినా అతనికి కసి తీరలేదు. అదే అతని పతనానికి, ఆమె మరణానికీ దారితీసింది. వాడు విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి...." అతని కంఠం గద్గదమయింది.

'ఏం చేశాడు' అన్నారు అంతా ఆతృతగా.

'ఆమెపై కిరసనాయిలు పోసి అంటించాడు. తను ఎవరికీ కనపడకుండా పారిపోయి మర్నాడు సాయంత్రం ఊరినుంచి వచ్చినవాడిలాగా వచ్చి ఏడుపునటించాడు. ఆమె ఆత్మహత్య చేసుకుందని అంతా నమ్మారు. ఇంకా చెప్పాలంటే వాడు నమ్మించాడు.'

'ఎంతపని చేశాడు దుర్మార్గుడు' రాజు ఇంకా ఆశ్చర్యంనుంచి పూర్తిగా తేరుకోక మునుపే అన్నాడు.

'మరి ఆమె దయ్యం అయి నేనున్న ఇంటికే ఎందుకువచ్చింది?' మూర్తి సందేహం వెలిబుచ్చాడు.

'అప్పట్నుంచి అలా ముసురు పట్టిన ప్రతి రాత్రి ఆమె ఆయింటికి వస్తోంది. ఆమె ఆ యింటికే రావటానికి కారణం ఆమె చనిపోయింది ఆ యింట్లోనే' అన్నాడు. అతడు విషాదంగా.

అందరూ ఆశ్చర్యంనుంచి అప్పుడే తేరుకుంటున్నారు.

'ఇంతకీ....ఇవన్నీ మీకెలా తెలుసు? మీరెవరు? మీపేరు?' అడిగాడు మూర్తి.

అతను ఒక్కక్షణం జీవం లేని చిరునవ్వు నవ్వాడు. కాని వెంటనే అతని ముఖంపై విషాదం చోటుచేసుకుంది.

'నేనేసార్, ఆ దౌర్భాగ్యుణ్ణి.... భుజంగాన్ని' ఏడుస్తూ ముఖాన్ని చేతుల్లో దాచుకున్నాడు అతను. ■